
# అశాశ్వతం

మడవనూరి సుబ్రహ్మణ్యం



"మేనకా! దయతో జవాబిచ్చిన నీకు కృతజ్ఞతలు ... మరోసారి ఆలోచించు. అందం అశాశ్వతము. ప్రేమానురాగాలే కడవరకు నిల్చేది. దేవుడు నీకు ద్విగుణీకృత అందాన్నిచ్చాడు — కాదనను. కాని నేను మాత్రం వికారంగా లేనే! నేను నలుపనే కదా నీవు వెనుకాడుతున్నది. దేవుడు నలుపు — శిరోజాలు నలుపు — నయనాలు నలుపు — మరి నలుపుకు ఇంత ప్రాధాన్యత వున్నప్పుడు నన్నెందుకసహ్యించు కుంటావ్? నేను కోరి నీ పాదాల చెంత చేరాలనుకున్నాను. నేను 'ఊఁ' అంటే వేయి మంది అందమైన యువతులు 'క్యూ'లో నిల్చుంటారు నన్ను పెళ్ళాడ్డానికి. వారిని ఆకర్షించడానికి నా డబ్బు, హోదా చాలు. కానీ...కానీ నేను నిన్నే మనసారా ప్రేమిస్తున్నాను. అందునా నీవు స్వయాన అక్క కూతురివి. అందుకే ఇంత భంగ పడుతున్నాను. అదీగాక అక్క అందంగా లేదని, బావ అక్కను దారుణంగా వదిలిపెట్టి పోయాడు. ఇప్పటికే లోకానికి జవాబు చెప్పలేక అక్క కుమిలిపోతూవుంది. అక్కకు, నీకు ఆసరాగా నిలవాలని నా ఆకాంక్ష. మన ముగ్గురిలో ప్రవహించే రక్తం ఒకటే. అందుకే ఇంత 'ఇది'గా నిన్ను ప్రార్థిస్తున్నాను. నీవు ప్రస్తుతానికి కాదన్నా, నీ మనసు మారి నన్ను చేసుకుంటాననేవరకు నీకోసం వేచివుంటాను. లేదా నీవు మరొకర్ని పెళ్ళాడితే నాకా అదృష్టం లేదని చింతిస్తాను.

ఇట్లు,

నీ ప్రియమైన బావ

సుందర్"

"ఎవరి దగ్గర్నుంచే వుత్తరం?" అమ్మ పిలుపుతో ఉత్తరాన్ని చదవడం పూర్తిచేసిన మేనక "మీ తమ్ముడేనమ్మా ఉత్తరం వ్రాసింది" అంటూ జవాబిచ్చింది.

"బావన్నేవూ! మరీ నీ వెర్రితనం కాకపోతే... ఏమి రాశాడేమిటె పిచ్చిసన్నాసి?" వంటింట్లోంచి వస్తూ అడిగింది పార్వతమ్మ.

"ఏమి రాస్తాడు? తనని పెళ్ళి చేసుకోమని రాశాడు... ఇది మామూలేగా... అతని పిచ్చి అతనికి ఆనందం." ఉత్తరం టేబుల్‌పైన పడేసి, తను ఇంద్రమోహన్ కిచ్చిన ప్రోగ్రాం ప్రకారం బీచి కెళ్ళడానికి తయారైంది.

"అమ్మా! నేను బీచి కెళ్తాస్తాను" పార్వతమ్మతో చెప్పింది.

"ఇప్పుడంత అర్జంటేమిటే?" చేతులు చీర కొంగుతో తుడుచుకుంటూ అడిగింది పార్వతమ్మ.

"ఇంద్రమోహన్‌ను కల్సుకోవాలి. నేను వస్తానని మాటిచ్చాను."

"పెళ్ళి కాకుండా ఈ కల్సుకోవటా లేమిటే ?" కోపంగా అడిగింది.

"నేనేమి చిన్న పిల్లను కాను. అతను నన్ను ఏమి చేయడులే! వాళ్ళమ్మ, నాన్నలు కూడా ఒప్పుకున్నారట. నన్ను తప్ప మరెవర్ని పెళ్ళి చేసుకోనని భీష్మించు కూర్చున్నాడు. పైగా కానీ కట్నం లేదు. ఇంకా చెప్పాలంటే అతను అందగాడు. నా తోటి లెక్చరర్ ... అన్నిటికి మించి అతను నాకు నచ్చినాడు. నేను అతన్ని ప్రేమించాను. కాని .. కాని ... నీవేమో బావను చేసుకోమంటావ్ ! చూసి చూసి నాకు నచ్చని పెళ్ళి చేస్తావా అమ్మా?" దీనంగా అడిగింది మేనక.

"నీ మనస్సు కష్టపెట్టేంత మూర్ఖురాలు కాదమ్మా మీ అమ్మ. అయితే ఒకటే మాత్రం గుర్తుంచుకో. నేను భర్త వుండి లేనిదానిలాగా వుండటానికి, నీకు తండ్రి లేకపోవడానికి కారణం ఈ అర్థంలేని ప్రేమలు, అందాలే నమ్మా. నీ అందాన్ని చూసి ఇంద్రమోహన్ కాకుంటే మరో చంద్రమోహన్ చేసుకుంటాడు ... నేను నీలాగే ఇంకా చెప్పాలంటే నీ కంటే అందంగా వుండేదాన్ని. ఆ అందం చూసే లక్షాధికారైన

## అశాశ్వతం

మీ నాన్న నన్ను చేసుకున్నాడు. నేను అందర్ని ఎదిరించి ... అతన్ని చేపట్టాను. ఒక్క సంవత్సరము బాగా గడించింది. స్వర్గమే చూశాను. ఆ సంవత్సరమే నీవు పుట్టావు. ఆ తర్వాత నాకు మశూచి వచ్చింది ... ఎన్నో సంవత్సరాల "అందం" కొద్ది రోజులలోనే మాడిపోయింది. నేను వికృతంగా వున్నానని, నా మొహాన ఒక లక్ష రూపాయలు పారేసి, తను మరొకర్ని వివాహం చేసుకున్నారు. నా పీడ వదిలించుకున్నారు. అప్పట్నుంచి మీ బావ, మీ తాత ఆసరాతో నిన్ను పెద్దదాన్ని చేసి, లెక్చరర్ని చేశాను... అందుకని నీవు బాగా ఆలోచించుకో! ఈ రోజు ఇంద్రమోహన్ నిన్ను మోహించి వుండవచ్చు. ఇంద్రలోకాన్నే చూపించవచ్చు... కాని ఎలాటి పరిస్థితులలోనైనా నీ అందం పాడైతే నీ జీవితం నా బ్రతుకులా కాకూడదు. అది ముందు తేల్చుకో ! కడవరకు నిన్ను తన హృదయంలో వుంచుకొని కాపాడగలిగేవాణ్ణే నీ జీవిత భాగస్వామిగా ఎంచుకో! అన్నీ తెలిసిన నీకు మీ అమ్మ ఇంకేం చెప్పలేదు... డ్యూటీకి వెళ్ళి తొందరగా వచ్చేయి" కూతుర్ని హెచ్చరించింది పార్వతమ్మ.

## చుక్కలు!

నిశిలో జాబిలి కోసం
మిణుకుమిణుకుమంటూ కోటి చుక్కలు
రాని వాన కోసం
రేకులో - నీటి చుక్కలు
తాగుబోతు మొగుడి కోసం
పెళ్ళాం కళ్ళల్లో - కన్నీటి చుక్కలు
విలాస కేళిలో విలవిలలాడడం కోసం
రసికుడి చొక్కాపై - పన్నీటి చుక్కలు
పై చుక్కల వైనం తెలపడం కోసం
ఈ నా - సిరా చుక్కలు!

— ఎస్. సంజీవ్

"సరేనమ్మా నీవు చెప్పినట్టే చేస్తాను; ఇంత మంచి అమ్మ దొరకడం నా అదృష్టం' తల్లి నుదుటిపై ప్రేమగా ముద్దుపెట్టుకుని డ్యూటీకి బయల్దేరింది మేనక. డ్యూటీలో —

"మీ అమ్మ మంచి సలహాయే ఇచ్చింది మేనకా! మనసా వాచా నీకు ప్రమాణం చేస్తున్నాను. నేను బ్రతికి వున్నంతకాలం నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను, ఇది నిజం. నీ అందం కాదు నాకు కావల్సింది నీ మనసు" చేతిలో చెయ్యి వేశాడు ఇంద్రమోహన్. మేనక తృప్తిగా అతని కళ్ళలోకి చూసింది

* * *

కాలేజి ఆవరణలో –


"ఇంద్రా! కంగ్రాట్యులేషన్స్! నీ పెళ్లి మేనకగారితో నిశ్చయమైనందుకు మా కందరికి ఎంతో ఆనందంగా వుంది. మాకు అందరికి గొప్ప పార్టీ ఇవ్వాలి" అభినందించాడు, రఘు హిస్టరి లెక్చరర్.

"తప్పకుండా." ఇంద్రమోహన్ చుట్టూ వున్న లెక్చరర్లందరికి ప్రామిస్ చేశాడు. "ఇంతకీ మేనక రాలేదేమబ్బా! కాలేజి బెల్ కూడా కొట్టేశారే," అనుకుంటుండగా –

ఆఫీసు బాయ్ పరుగు పరుగున వచ్చాడు. ఇంద్రమోహన్‌ను ఉద్దేశించి "సార్ ! సార్ ! మేనకమ్మగారికి ఫైర్ ఏక్సిడెంట్ అయిందట. స్టౌ ముట్టిస్తూంటే మంట పైకి ఎగసి..." చెప్పలేక రొప్పుతున్నాడు.

ఇంద్రమోహన్ ఒక్కసారిగా షాక్ తిన్నాడు. వెంటనే స్కూటర్ వేసుకుని మేనక ఇంటికి బయల్దేరాడు.

* * *



రాక్షసిని చూసినట్లు గట్టిగా అరిచాడు ఇంద్రమోహన్ మేనక రూపాన్ని చూసి. మేనక ముఖం వికృతంగా కాలి బొబ్బలెక్కిన గాయాల్తో నీరు కార్తూ కుష్ఠురోగిలా తోచింది ... "నో! నో! నువ్వు నా మేనక కాదు ... నాక్కావల్సింది ఈ మేనక కాదు" పిచ్చిగా అరిచాడు.

"మరి మన పెళ్ళి!" దీనంగా అన్నట్టు న్నాయి మేనక చూపులు. పార్వతమ్మ కొంగు నోటిలో కుక్కుకొని ఏడుస్తూ వుంటే—

"నో! నిన్నిక పెళ్ళి చేసుకోలేను. నాకా విశాల హృదయం లేదు. నన్ను క్షమించు మేనకా ... నన్ను క్షమించు." వడి...వడిగా వీధిలోకి నడిచాడు ఇంద్రమోహన్.

* * *

"స్టార్ట్ ఇమీడియట్లీ ఫైర్ యాక్సి డెంట్ టు మేనక," టెలిగ్రామ్ చదువుకున్న సుందర్‌కు కంపరమెత్తింది. ఎకాఎకిని బయల్దేరాడు. బస్సులో అతను చేసిన ఓ గంట ప్రయాణంలోను అతను పడిన మానసిక బాధ వర్ణనాతీతం ...

ఇల్లు చేరేసరికి అప్పుడే చక చక మెట్లు దిగి వీధిలోకి వస్తూన్న ఇంద్రమోహన్ కనిపించాడు. "ఏమైంది మేనకకు?" ఆత్రుతతో ప్రశ్నించాడు సుందర్. అతనికి జవాబివ్వకనే, స్కూటర్ 'స్టార్ట్' చేసుకొని వెళ్ళిపోయాడు ఇంద్రమోహన్.

గబగబా మెట్లెక్కి "ఏమైందక్కయ్యా మేనకకు? అసలీ ఘోరం ఎలా జరిగింది?" ఎదురుగా వచ్చిన పార్వతమ్మను కుదిపేస్తూ అడిగాడు.

పార్వతమ్మ మౌనంగా మేనక గదివైపు నడిచింది.

మేనకను చూసి బావురుమన్నాడు సుందర్. "బావా! ఏడవకు బావా! నా గర్వమంతా తగ్గిపోయింది. అందంతోపాటు అదీ కాలి మాడిపోయింది. ఇప్పుడు నేను ఎవరికీ పనికిరానిదానను. నాకు మాటిచ్చి తప్పాడు నేను నమ్ముకున్న ఇంద్రమోహన్. బాహ్య సౌందర్యంకన్న అంతర్ సౌందర్యము ముఖ్యం అన్నమాటలే నా చుట్టు ప్రతిధ్వనిస్తూ వున్నాయి... బావా నేను కాదన్నా నాపైన నీవు ప్రేమ చూపావు. ఇప్పుడు అదే ప్రేమతో కళ్ళు నీళ్ళు పెట్టుకుంటున్నావు. చాలు బావా నాకీ ప్రేమచాలు. ఇక నా జీవితం అంతమయినా పర్వాలేదు. అసలు బ్రతికున్నా వన్నెవరు చేసుకుంటారు?" విషాద వదనంతో అంది మేనక.

"అంత మాటనకు మేనక... నే నేనాడో చెప్పాను. నా మనస్సు మారదని... నేను అంతః సౌందర్యాన్నే ప్రేమిస్తానని... నీవు వాదానివే! ఎప్పటికైనా... నిన్ను నేను విడచి పెట్టను మేనకా! విడిచిపెట్టను." మేనక చేతిని చేతిలోకి తీసికొని అన్నాడు.

"నిజంగానా బావా!" అంత బాధలోను మేనక మొహంలో నవ్వు విరబూసింది. కృతజ్ఞతతో ఆమె కళ్ళు వెలిగాయి.


ది
న
ఆంధ్రపత్రికలో
త్రి
కలో

* నారీ దృక్పథం
* డాక్టరు కబుర్లు
* గ్రంథ సమీక్షలు
* రామాయణం
* శ్రీకృష్ణ భాగవతం

చదవండి!


"అక్కయ్యా! టాక్సీ పిలుచుకొని వస్తా! నీవు జాగ్రత్తగా మేనకను చూస్తుండు. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళుదాం." పరుగు పరుగున బయటకు వెళ్ళాడు సుందర్.

"చూశావామ్మా సుందర్ హృదయం ఎంత సుందరమైనదో!" మేనకను చూస్తూ అంది పార్వతమ్మ.

* * *

కాలేజి లెక్చరర్స్ రూమ్‌లో ఇంద్రమోహన్ తోటి లెక్చరర్లతో బాతాఖాని కొడుతున్నాడు. అప్పటికి మేనక కాలేజికి వచ్చి రెండురోజులు అయ్యింది. "పెళ్ళి కాకముందే మేనకకు అలా కావడం మంచిదైపోయింది. లేకపోతే నీ జీవితం అంతా పాడైపోయి వుండేది!" అందరు లెక్చరర్లూ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఇంతలో మేనక ఆ గదిలోకి వచ్చింది. వయ్యారంగా — అచ్చు అప్సరసలా — కల హంసలా — తెల్లని వెన్నెలలా—సెలయేరులా—గలగల నవ్వులతో వచ్చింది. ఇంద్రమోహన్‌తో బాటు అందరూ ఆశ్చర్యపోయారు. ఎప్పటిలా మేనక అందంగా వుంది. కాలిన మచ్చలు కూడా లేవు. నోటి మాట కూడ రాలేదు ఎవ్వరికి.

విశ్చేష్టులై చూస్తున్న వార్నుద్దేశించి మేనక అంది—"నాకు తెల్సు మీరంతా నోళ్ళు వెళ్ళబెడ్తారని, నాకేం కాలేదు. ఫైర్ యాక్సిడెంటూ లేదు ... యాక్సిడెంటల్ ఫైరూ కాదు. మా అమ్మ సలహా అను సరించి ఓ అయిడియా వచ్చింది. వెంటనే మా అమ్మ సహకారంతో ఆచరణలోకి పెట్టాను

అందుకే అలా నటించాల్సి వచ్చింది. నేను పెట్టిన ఈ పరీక్షలో ఇంద్రమోహన్ ఓడిపోయాడు. మా బావ సుందర్ గెలిచాడు. అతని మనస్సు సుందరమని తెల్సి, కడవరకు మిగిలేది అనురాగ అనుబంధాలేకాని పైకి కన్పించే అందాలు శాశ్వతం కాదన్న సత్యాన్ని మా అమ్మ జీవితం ద్వారా, ఈ పరీక్ష ద్వారా తెల్సుకున్నాను. అందుకు మా అమ్మకు ఎంతో ఋణపడివున్నాను. మేకప్ చేసుకోడానికి పది రూపాయలు ఖర్చు కాకపోతే ఇంద్ర మోహన్‌ను చేసుకొనివుంటే నా జీవితమే ఖర్చు అయిపోయేది... బై ది బై... నాకు మా బావకు నెక్స్ట్ వీక్ పెళ్ళి... పిలవటానికే ఈ రోజు వచ్చాను. ఈ రోజునుంచి లీవు పెడ్తున్నాను... మళ్ళీ రాలేకపోవచ్చు. మీరందరూ తప్పక రావాలి... మీరుకూడ మోహన్‌గారూ!" "మోహన్‌గారు" అన్న పదాన్ని వత్తి పలుకుతూ ఇంద్రమోహన్ వైపు చూసింది. అసలు విషయం తెల్సుకున్న ఇంద్రమోహన్ సిగ్గుతో తల దించుకున్నాడు. అందరికి శుభలేఖలు పంచింది. మరోసారి అందర్ని ఆహ్వానించి గది బయటకు నడిచింది.

అందరూ విస్తుపోయి చూస్తూండి పోయారు. ★